ప్రభాత
తెలుగు దినపత్రిక
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
JAYABHERIDAILY.COM
02-11-2024
శనివారం
మల్కాజిగిరి
సంపుటి : 02 | సంచిక : 57 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
JB జయభేరి



# ఇది విద్యార్థుల పోరాట విజయం

**రాష్ట్రంలో ప్రభుత్వ వసతి గృహ విద్యార్థినీ విద్యార్థులకు ఇకపై బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని అందించాలని, పెంచిన డైట్, కాస్మొటిక్ చార్జీలను పది రోజుల్లోగా అందుబాటులోకి తేవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.**

ప్రస్తుతం అమలులో ఉన్న రేట్లకు 40 శాతం మేరకు డైట్, కాస్మొటిక్ చార్జీలను పెంచాలన్న అధికారుల నేతృత్వంలోని కమిటీ ప్రతిపాదనలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యథాతథంగా ఆమోదించారు.

ఈ పెంపుదల వల్ల రాష్ట్రంలో 7,65,705 మంది విద్యార్థినీ విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది. కీలకమైన ఈ నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, వివిధ సంక్షేమ విభాగాల సెక్రటరీలు ముఖ్యమంత్రి ని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. దీపావళి పండుగ శుభ సందర్భంగా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ వసతి గృహాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వసతి గృహాలు, తెలంగాణ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (TREIS) పరిధిలోని విద్యార్థులకు డైట్, కాస్మొటిక్ ఛార్జీలను ప్రభుత్వం పెంచింది. డైట్ చార్జీల పెంపు విషయంలో కమిటీ ప్రతిపాదనను యథావిధిగా అమలు చేయడంపై అధికారులు హర్షం వ్యక్తం చేసారు,. విద్యార్థులకు పోషకాహారం అందేలా డైట్ లో మార్పులు, చేర్పులు చేయాలని అధికారులకు సీఎం సూచించారు. పది రోజుల్లో కొత్త డైట్ ను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.


# జవాన్లకు మిఠాయిలు తినిపించిన ప్రధాని మోడీ



**✍ జయభేరి, న్యూఢిల్లీ నవంబర్ 1**

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మరోసారి జవాన్లతో కలిసి దీపావళి వేడకల్లో పాల్గొన్నారు. గురువారం దివాళి ఫెస్టివల్ సందర్భంగా ప్రధాని మోడీ జవాన్లకు మిఠాయిలు తినిపించారు. గుజరాత్ పర్యటనలో ఉన్న ప్రధాని అక్కడి కచ్ ప్రాంతంలో విధులు నిర్వర్తిస్తున్న సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) జవాన్లతో కలిసి దివాళి సెలబ్రేషన్స్ చేసుకున్నారు. కచ్‌లోని సర్ క్రీక్ ప్రాంతంలోని లక్కీ నాలా వద్ద గస్తీ కాస్తున్న జవాన్లకు ప్రధాని బీఎస్ఎఫ్ యూనిఫాం ధరించి మిఠాయిలు తినిపించి పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. కాగా, ప్రతి సంవత్సరం దీపావళి పండగను పురస్కరించుకుని దేశ సరిహద్దులో జవాన్లతో కలిసి వేడుకలు చేసుకుంటున్న సంగతి తెలిసిందే.అంతకుముందు, దేశ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. "దీపావళి సందర్భంగా దేశప్రజలకు శుభాకాంక్షలు. ఈ దివ్య దీపాల పండుగ సందర్భంగా, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా, సంతోషకరమైన, సంపన్నమైన జీవితాన్ని గడపాలని కోరుకుంటున్నాను. మా లక్ష్మి, శ్రీ గణేశుడి ఆశీస్సులతో ప్రతి ఒక్కరూ వర్ధిల్లాలని కోరుకుంటున్నాను" అని ప్రధాని ఎక్స్ లో పోస్ట్ చేశారు.

# తెలంగాణలోనూ గడబిడగా గాలి



**✍ జయభేరి, హైదరాబాద్, నవంబర్ 1:**

ముక్కు మూసుకుంటే ప్రాణం పోతుందో లేదో కానీ గట్టిగా గాలి పీలిస్తే లైఫ్‌కు రిస్కే. వెన్నుపోటు అక్కర్లేదు. డైరెక్ట్‌గా పొగపోటే. ఢిల్లీలోనే కాదు తెలంగాణలోనూ గాలి ఓ రేంజ్‌లో గడబిడ చేస్తోంది. హైదరాబాద్, వరంగల్ సహా పది జిల్లాల్లో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్‌డేంజర్ బెల్స్ మోగిస్తోంది.వ్యర్థాలకు మంట.. ప్రాణాలకు పొగ. కాలుష్య రాజధానిగా ఢిల్లీ ఆరోగ్యం మసకబారుతోంది. హర్యానా , పంజాబ్ సాగు వ్యర్థాలకు నిప్పు పెట్టడంతో పొగ మేఘాలు ఢిల్లీపై పంజా విసరుతున్నాయి. ఢిల్లీ సహా పరిసర ప్రాంతాల్లో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ ప్రమాద ఘంటికలను మోగిస్తోంది. కట్ చేస్తే ఇక తెలంగాణలో సైతం అదే దుస్థితి రాబోతుందా? చాపకింద నీరులా కాదు.. గాలి చాటున గత్తర దూసుకు వస్తోందని ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ లెక్కలు హెచ్చరిస్తున్నాయి. ఒకవైపు చూస్తే నగరం విస్తరిస్తోంది. రెండో వైపు చూడకపోతే నగరం ఖచ్చితంగా నరకంగా మారే ప్రమాదం వుంది. గాలి నాణ్యతకు సంబంధించి వివిధ సంస్థల అధ్యయనంలో సంచలనాలు వెలుగుచూశాయి .హైదరాబాద్ చుట్టుపక్కల జిల్లాలు సహా వరంగల్, నిజామాబాద్‌లో ఎయిర్ క్వాలిటీ ప్రమాదకర స్థాయిలో తగ్గుతోంది. గ్రేటర్ హైదరాబాద్‌లో ఏక్యూఐ 128 ఉండగా, పార్టిక్యులేట్మ్యాటర్ స్థాయి 2.5 గ్రాములు ఉంది. వరంగల్‌లో అత్యధికంగా ఏక్యూఐ 143 ఉండగా, పీఎం 2.5 స్థాయిలు క్యూబిక్

...మిగతాది 2 లో



# కవితకు జాగృతి చిక్కు

**✍ జయభేరి, హైదరాబాద్, నవంబర్ 1:**

భారత్ జాగృతి... బతుకమ్మ పండుగ నేపథ్యంలో ఏర్పడి.. తర్వాత కాలంలో ఉద్యమం దిశగా సాగిన వ్యవస్థ. కేసీఆర్ కుమార్తె కవిత ఆధ్వర్యంలో ఆరంభంలో బాగానే నడిచినా.. క్రమేపీ జాగృతి కార్యకలాపాల వేగం తగ్గిందనే చెప్పాలి. ఢిల్లీ లిక్కర్ కేసులో.. కవిత పేరు చేర్చిన నాటి నుంచి తెలంగాణలో ఈ మాటే దాదాపు కనుమరుగు అయ్యిందనే ప్రచారం సాగుతోంది. ప్రస్తుతం జాగృతి భవితవ్యం ప్రశ్నార్థకంగా మారిందట.భారతీయ రాష్ట్ర సమితి అనుబంధ సంస్థగా పేరు తెచ్చుకున్న భారత్ జాగృతిని కేసీఆర్ కుమార్తె కవిత

...మిగతాది 2 లో

# దీపం పథకం ప్రారంభం

## టీ కాచిన చంద్రబాబు



**✍ జయభేరి, శ్రీకాకుళం, నవంబర్ 1:**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దీపం 2.0 పథకాన్ని ప్రారంభించారు. శుక్రవారం శ్రీకాకుళం జిల్లా ఇచ్చాపురం మండలం ఈదుపురం గ్రామంలో పర్యటించిన సీఎం చంద్రబాబు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ పథకానికి శ్రీకారం చుట్టారు. శాంతమ్మ అనే మహిళ ఇంటికి వెళ్లి గ్యాస్ సిలిండర్ పంపిణీ చేశారు. అనంతరం స్వయంగా గ్యాస్ వెలిగించి టీ పెట్టారు సీఎం చంద్రబాబు. ఈ సందర్భంగా వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఇంట్లో కుటుంబ సభ్యుల సంఖ్య, ఎంత మందికి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని ఆరా తీశారు. తర్వాత కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, మంత్రులు నాదెండ్ల మనోహర్, అచ్చెన్నాయుడు, కొండపల్లి శ్రీనివాస్ తో కలిసి టీ తాగారు. ఆ తర్వాత సీఎం చంద్రబాబు అదే వీధిలో మరో ఒంటరి మహిళకు పెన్షన్ పంపిణీ చేశారు.అంతకు ముందు.. శ్రీకాకుళం జిల్లాకు చేరుకున్న సీఎం చంద్రబాబుకు మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు ఘనస్వాగతం పలికారు. హెలిప్యాడ్ దగ్గర బస్సులో టీడీపీ నేతలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. తొలి ఏడాది ఉచిత గ్యాస్ సిలిండర్ పథకానికి 2684 కోట్ల రూపాయలు విడుదల చేసింది ప్రభుత్వం. ఇందులో తొలి విడత కోసం 894కోట్ల రూపాయల చెక్‌ను పెట్రోలియం సంస్థలకు అందజేశారు. సాయంత్రం అధికారులతో ముఖాముఖిలో సమీక్ష నిర్వహిస్తారు సీఎం.ఈ రాత్రికి శ్రీకాకుళంలోనే బస చేయనున్నారు చంద్రబాబు.. శనివారం విజయనగరం జిల్లాలో రోడ్ల మరమ్మతు పనులకు శ్రీకారం చుడతారు. గజపతినగరం మండలం పురిటిపెంట దగ్గర రోడ్డుపై గుంతలను పూడ్చే పనుల్లో స్వయంగా పాల్గొంటారు సీఎం. భోగాపురం ఎయిర్‌పోర్టు పనుల పురోగతిని పరిశీలించి.. అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు.



# మందు బాబులకు బ్యాడ్ న్యూస్

## మరో రూ.1000 కోట్ల ఆదాయం లక్ష్యం

**✍ జయభేరి, హైదరాబాద్, నవంబర్ 1:**

ఎక్కువ మద్యం విక్రయాలు జరిగిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. ఈ క్రమంలో తెలంగాణలో మందు బాబులకు భారీ షాక్ తగలనుంది. రాష్ట్రంలో త్వరలో మద్యం ధరలు పెంచడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. వైరల్ అవుతున్న సమాచారం ప్రకారం.. ఒక్కో బీరు బాటిల్ పై దాదాపు రూ.20 వరకు ధర పెరగనుంది. లిక్కర్ బాటిల్స్ పై రూ.20 నుంచి 70 రూపాయల వరకు పెంచేందుకు రాష్ట్ర ఆబ్కారీ శాఖ కసరత్తు చేపట్టింది. కొత్తగా పెరగనున్న మద్యం ధరలతో రాష్ట్ర ప్రభుత్వానికి నెలకు రూ.1000 కోట్ల వరకు అదనపు ఆదాయం చేకూర్చడానికి ఎక్సైజ్ శాఖ ప్లాన్ చేసింది. రాష్ట్ర ప్రభుత్వానికి అదనపు ఆదాయం సమకూర్చాలని సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల

...మిగతాది 2 లో



# లిక్కర్ సేల్స్ లో తెలంగాణ టాప్

**- జయభేరి, హైదరాబాద్, నవంబర్ 1:**

సౌత్ ఇండియాలోనే లిక్కర్ సేల్స్‌లో తెలంగాణ మొదటి స్థానంలో ఉండగా, ఏపీ రెండో స్థానంలో ఉంది. తెలంగాణలో గత ఏడాది సగటున ఒక్కొక్కరు రూ.1,623 మద్యం కోసం ఖర్చు చేయగా... ఏపీలో రూ.1,306 ఖర్చు చేసినట్లు ఢిల్లీలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ పాలసీ (ఎన్ఐపీఎఫ్‌పీ) వెల్లడించింది. పంజాబ్‌లో రూ.1,245, ఛత్తీస్‌గఢ్‌లో రూ.1,227 చొప్పున ఒక్కో వ్యక్తి ఖర్చు చేస్తున్నట్లు పేర్కొంది.పశ్చిమ బెంగాల్, ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్, త్రిపుర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో మద్యంపై తక్కువ ఖర్చు చేస్తున్నట్లు అంచనా వేసింది. తెలంగాణలో 2,620 మద్యం దుకాణాలు, వెయ్యికిపైగా బార్లు, పబ్స్ ఉన్నాయి. దసరాకు దాదాపు రూ.1,000 కోట్ల మద్యం విక్రయాలు జరిగినట్లు తెలుస్తుంది. 11 లక్షల కేసుల మద్యం, 18 లక్షల కేసుల బీర్ల విక్రయాలు జరిగినట్లు తెలుస్తుంది. ఏప్రిల్ నుంచి అక్టోబర్ మధ్య బీర్లుకు రూ.302.84 లక్షలు ఖర్చు చేసినట్లు అంచనా వేశారు. ఆంధ్రప్రదేశ్‌లో 169 బీర్ల అమ్మకాలు జరిగాయి.

▶▶ మొదటిపేజీ తరువాయి

## కవితకు జాగృతి చిక్కు

ప్రారంభించారు. తెలంగాణ ప్రాంతానికి అత్యంత కీలకమైన బతుకమ్మ పండుగ నిర్వహణ కోసం ప్రారంభమైన జాగృతి.. తర్వాత కాలంలో అనేక సభలూ.. సమావేశాలు నిర్వహించింది. జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలిగా కవిత ఉండి.. అన్నీ తానై నడిపించారు. ఇక్కడవరకూ ఓకే.. కానీ.. ఇటీవల కాలంలో ఆమె జైలుపాలు కావటంతో.. జాగృతి భవితవ్యం ఏంటని చర్చ జోరుగా సాగిందట.భారత్ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కవిత... రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ జాగృతి కమిటీలను మార్చి 10న రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. త్వరలోనే నూతన కమిటీలు ఏర్పాటు చేస్తామని ఆమె ప్రకటించారు కూడా. జాగృతి కమిటీలు రద్దు చేసి.. సుమారు ఏడు నెలలు దాటినా... నూతన కమిటీలపై ఆమె దృష్టి సారించడం లేదనే వార్తలు గుప్పుమంటున్నాయి. ఢిల్లీ లిక్కర్ కేసులో అరెస్టైన కవిత.. చాలాకాలం జైలు జీవితాన్ని గడిపారు. ఒకానొక సమయంలో ఆమెకు బెయిల్ కూడా రాని పరిస్థితి ఏర్పడింది. ఓ వైపు తెలంగాణలో అధికారం కోల్పోవటం, మరోవైపు కుమార్తె జైలు పాలవటంతో కేసీఆర్.. ఉక్కిరిబిక్కిరి అయ్యారు.దేశరాజకీయాల్లోనూ చక్రం తిప్పుతానని శపథం చేసిన కేసీఆర్... ప్రస్తుతం ఫామ్‌హౌస్‌కే పరిమితం అయ్యారు. ఈ నేపథ్యంలో కొత్త కమిటీల మాటెలా ఉన్నా.. జాగృతి ఉంటుందా లేదా అనే అనుమానాలు తెరపైకి వస్తున్నాయి. 2006 ఆగస్టులో భారత్ జాగృతిని కవిత ఏర్పాటు చేశారు. తర్వాత ఏడాది అంటే 2007 నవంబర్ నుంచి జాగృతి ఆధ్వర్యంలో కార్యక్రమాలు అధికారికంగా ప్రారంభమ్యాయి. బతుకమ్మ పండుగను అన్ని తామై జాగృతి సభ్యులు ముందుండి నడిపించారనే వాదన ఉంది.2014లో BRS అధికారంలోకి వచ్చిన తరువాత పదేళ్లపాటు తిరుగులేని ఆధిపత్యాన్ని... జాగృతి కొనసాగించింది. జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ కమిటీలను పెద్ద ఎత్తున్న ఏర్పాటు చేసి తమ పరిధిని పెంచుకోవటంపై కవిత దృష్టి సారించారు. ఏమైందో... ఏమో....BRS పార్టీ అధికారం కోల్పోయిన తరువాత జాగృతి కమిటీలు రద్దు చేశారు కవిత. ఢిల్లీ లిక్కర్ కేసులో బెయిల్‌పై విడుదల అయిన కవిత.. జాగృతి నూతన కమిటీలపైన దృష్టిసారిస్తారని అందరూ భావించారు. తీరా చూస్తే.. ఆమె పూర్తిస్థాయి విశ్రాంతికే పరిమితం అయ్యారట. నూతన కమిటీల ఊసే లేకపోవటంతో.. జాగృతి భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. జాగృతి కమిటీల్లో ఉన్నవారు.. ఎటూ తేల్చుకోలేక పోతున్నారట. కమిటీలు రద్దు అయ్యి నెలలు గడుస్తున్నా.. నూతన కమిటీలపై దృష్టి పెట్టకపోవడం, ఎవరికీ ఆమె అందుబాటులోకి రాకపోవడంపై.. గతంలో జాగృతి కమిటీలో ఉన్నవారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారట. భారత్ జాగృతి.. నూతన కమిటీలను ఎందుకు ఏర్పాటు చేయడం లేదని చర్చ.. తెలంగాణ వ్యాప్తంగా సాగుతోందట. గతంలో యాక్టివ్‌గా ఉండి అన్నీ తానై నడిపించిన కవిత.. కేసులో ఇరుక్కోవటంతో సమయం లేక ఆ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారట. ఆమె బయటకు వచ్చాక.. మళ్లీ భారత్ జాగృతిపై దృష్టిసారిస్తారని అంతా భావించారు. కానీ.. కవిత మాత్రం తాను విశ్రాంతి తీసుకుంటానని ప్రకటించటంతో ఓ రకంగా జాగృతి సభ్యులు తీవ్ర నిరాశ వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. నవంబర్ నెలలో జాగృతి కార్యకలాపాలపై దృష్టి సారిస్తారనే వార్తలూ వినిపిస్తున్నాయి. పార్టీ అధికారం కోల్పోయింది కాబట్టి.. నూతన కమిటీల ఏర్పాటులో జాప్యం జరుగుతుందా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఉద్యమ సమయంలో ఏర్పాటు చేశారు కాబట్టి.. అధికారం కోల్పోగానే ఎలా రద్దు చేస్తారని.. అందులోని సభ్యులే చర్చించుకుంటున్నారట. అసలు జాగృతి కమిటీలు రద్దు ఎందుకు చేసుకోవాల్సి వచ్చిందని పొలిటికల్ సర్కిల్లో టాక్ వినిపిస్తుంది.మరోవైపు.. జాగృతి రన్ అవుతున్న సమయంలోనే పెద్ద మొత్తంలో జాగృతి ఫండ్ వసూల్ చేశారని ఆరోపణలున్నాయి. అంత పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసి వాటిని ఎటువైపు మళ్లించారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయట. కమిటీల ఏర్పాటు మాటెలా ఉన్నా.. వసూలైన ఎమౌంట్‌కు లెక్కాపత్రాల సంగతేంటని కొందరు ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఢిల్లీ లిక్కర్ కేసులో బెయిల్‌పై విడుదలైన కవిత... కొన్ని రోజుల నుంచి పూర్తి స్థాయి విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆమె దీపావళి పండుగ తర్వాత యాక్టివ్ అవుతారని ఆమె వర్గీయులు చెబుతున్నారట. కొత్త కమిటీల ఏర్పాటుతో పాటు పాత ఫండింగ్ విషయంలో తలెత్తిన ప్రశ్నలకు కవిత ఏ విధంగా సమాధానం చెబుతారో చూడాలి.

## తెలంగాణలోనూ గడబిడగా గాలి

మీటర్ గాలిలో 59 మైక్రోగ్రాముల మేర నమోదయింది. స్థాయి 50 దాటిందంటే.. గాలి గాడి తప్పినట్టే. తెలంగాణలో ఇప్పుడు చాలా చోట్ల 100 నుంచి 150 మార్క్‌ను టచ్ చేసింది. AQI స్థాయి 50 నుంచి 100 మధ్య ఉంటే గాలి నాణ్యత పూర్‌క్వాలిటీ, 100 నుంచి 150 వరకుంటే 'అన్హెల్దీ', 150 నుంచి 200 రికార్డయితే డేంజర్.. ఇక AQI మూడు వందల రేంజ్‌లోకి వెళ్లింది ఇక ప్రాణాలకు మూడినట్టే. 300 ప్లస్ రికార్డయితే పరిస్థితి యమ డేంజర్ . ఢిల్లీ తరహాలో కాదు కానీ తాజా గణాంకాల ప్రకారం తెలంగాణలోనూ ఎయిర్ పొల్యూషన్ డేంజర్ బెల్స్ మోగిస్తోంది. వాహనాలు... పరిశ్రమలు ఇప్పటికే పొగ పెడుతుంటే ..దీపావళి బాణా సంచాతో గండానికి మరింత సెగ వేసినట్టయింది. గాలి కలుషితమైతే శ్వాస సంబంధ వ్యాధులు సహా హార్ట్ స్ట్రోక్స్ పెరిగే అవకాశం వుంటుంది. సైలెంట్ కిల్లర్‌లా దూసుకు వస్తున్న కాలుష్యానికి కళ్లెం వేయడం ప్రతి ఒక్కరి బాధ్యత. కుదిరితే కాలుష్య నియంత్రణకు సహకరించాలి. వ్యక్తిగతంగా ప్రాణాలు కాపాడుకోవాలంటే కరోనా రూల్ పాటించాలి. మాస్క్ ధరించడం మంచిదంటున్నారు నిపుణులు. గాలే కదా అని లైట్‌గా తీస్కోంటే .. లైఫ్ పొగచూరిపోవడం ఖాయం. జర భద్రం బికేర్ ఫుల్.

## మందు బాబులకు బ్యాడ్ న్యూస్

మంత్రులకు, పలు శాఖల ఉన్నతాధికారులకు సూచించారు. ఈ క్రమంలో రాష్ట్రానికి అధిక ఆర్థిక వనరుగా ఉన్న మద్యంపై ఆదాయం ఆర్జించడానికి ఎక్సైజ్ శాఖ సన్నద్ధమైంది. దాంతో బీర్లు, లిక్కర్ బాటిల్ పై కనీసం రూ.20 నుంచి ధరలు పెంచడానికి ప్రయత్నాలు చేపట్టారు. ఈ ప్రతిపాదన సీఎం రేవంత్ రెడ్డి వద్దకు వెళితే ఆయన నిర్ణయం తీసుకోనున్నారు. ఆయన ఏమైనా సూచనలు చేస్తే ఎక్సైజ్ శాఖ ధరల్లో స్వల్ప మార్పులు చేర్పులు చేసిన అనంతరం తెలంగాణలో మద్యం ధరలు పెరగనున్నాయి.దేశంలో మద్యం విక్రయాలలో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది. ఢిల్లీలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ పాలసీ చేపట్టిన సర్వేలో తెలంగాణలో గత ఏడాది అత్యధిక మద్యం విక్రయాలు జరిగాయి. తెలంగాణలో గతేడాది రాష్ట్రంలో మద్యం కోసం సగటున ఒక వ్యక్తి రూ.1,623 ఖర్చు చేశారు. ఈ జాబితాలో మరో తెలుగు రాష్ట్రం రెండో స్థానంలో నిలిచింది. ఏపీలో మద్యం కోసం ఒక వ్యక్తి సగటున రూ.1,306 ఖర్చు చేశారు. పంజాబ్ లో రూ.1,245 ఖర్చు పెట్టగా, ఛత్తీస్‌గఢ్‌లో ఒక్కో వ్యక్తి మద్యంపై రూ.1,227 ఖర్చు చేసినట్లు NIPFP సర్వేలో పేర్కొంది.

## వచ్చే ఐదు మాసాల్లో రూ. 1372 కోట్ల నిధులతో ప్రణాళికలు

ఆమోద ముద్ర వేసిన మంత్రి సీతక్క

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని (MGNREGS) రాష్ట్రంలో పకడ్బందిగా అమలు చేయాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. ప్రణాళిక బద్ధంగా పనులు చేయించాలని సూచించారు. రైతుల ఆదాయం పెంచేలా, ఉపాధి హామీ నిధులతో వ్యవసాయ అనుబంధ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. శాశ్వతంగా నిలిచేలా ఉపాధి హామీ పనులు చేపట్టాలన్నారు. ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని చెప్పారు. రాష్ట్రంలో MGNREGS అమలు పై పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క శుక్రవారం నాడు సమీక్షా సమావేశం నిర్వహించారు. సచివాలయంలో తన చాంబర్ లో పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, కమీషనర్ అనితా రామచంద్రన్, స్పెషల్ కమీషనర్ షఫిఉల్లా, మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ కాంతి వెస్లీ, పంచాయతీ ఇంజనీరింగ్ విభాగం ఈఎన్సీ కనకరత్నం, ఇతర ఉన్నతాధికారులతో మంత్రి సీతక్క బేటి అయ్యారు. రాబోయే 5 నెలల కాలానికి సంబంధించి రూ. 1372 కోట్ల MGNREGS లో నిధులతో చేపట్టే పనుల ప్రణాళికలకు ఆమోదం తెలిపారు. మహిళలకు ఉపాధి భరోసా, పంటపొలాలకు బాటలు, పండ్ల తోటల పెంపకం, వర్షపు నీటిని ఒడిసి పట్టడం, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన కింద చేపట్టే పనులను ఫైనలైజ్ చేసారు. రూ. 106 కోట్ల నిధులతో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద ప్రతి నియోజకవర్గానికి సుమారు కోటి నిధులను వెచ్చించాలని నిర్ణయించారు. మొత్తం 5,400 మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆదాయాన్ని పెంచే దిశలో పశువుల కొట్టాలు, కోళ్ళ షెడ్ల నిర్మాణాం, వర్మి కొంపోస్ట్‌వాన పాముల ఎరువుల తయారీకి తోట్ల నిర్మాణం, SHG లో ఉన్న రైతుల బీడు భూములను అభివృద్ధి చేసి సాగులోకి తీసుకొచ్చే ప్రణాళిలకు మంత్రి సీతక్క ఆమోదం తెలిపారు.

# దీపావళి విషాదాలు

వేర్వేరు ప్రమాదాల్లో 9 మంది మృతి, ఉల్లిపాయ బాంబు పేలి వ్యక్తి శరీరం ఛిద్రం దీపావళి పండుగ రోజున ఏపీలో తీవ్ర విషాదాలు చోటు చేసుకున్నాయి.



**జయభేరి, హైదరాబాద్, నవంబర్ 1:** దీపావళి పండుగ రోజున ఏపీలో తీవ్ర విషాదాలు చోటు చేసుకున్నాయి. ఏలూరులో ఓ వ్యక్తి బాణాసంచా తీసుకెళ్తుండగా భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటన నగరంలోని తూర్పు వీధిలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుధాకర్ అనే వ్యక్తి బైక్‌పై ఉల్లిపాయ బాంబుల బస్తా తీసుకెళ్తున్నాడు. గంగానమ్మ ఆలయం సమీపంలోకి వచ్చేసరికి రోడ్డుపై గుంత కారణంగా బైక్‌పై నుంచి బస్తా కింద పడింది. ఈ క్రమంలో భారీ పేలుడు సంభవించి అతను అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుడి శరీర భాగాలు ఛిద్రమయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విశాఖ జిల్లా పద్మనాభం మండలం కురపల్లి గ్రామంలో ఓ ప్రైవేటు రిసార్టులో పుట్టినరోజు వేడుకలు విషాదం నింపాయి. స్నేహితులతో కలిసి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న అభిషేక్ వంశీ (24) అనే వ్యక్తి మద్యం తాగి స్విమ్మింగ్ ఫూల్‌లో దిగి ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

**రైలు ఢీకొని..**

ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని తల్లీకుమార్తెలు మృతి చెందిన ఘటన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలిలో చోటు చేసుకుంది. శిరీష అనే మహిళ తన తల్లి వజ్రమ్మను విజయవాడ ప్యాసింజర్ రైలు ఎక్కించేందుకు కావలి రైల్వే స్టేషన్‌కు వచ్చారు. పట్టాలు దాటుతున్న క్రమంలో వజ్రమ్మ 3వ ప్లాట్ ఫాం ఎక్కలేకపోవడంతో.. శిరీష సాయం చేయబోయింది. ఇంతలో వేగంగా వచ్చిన కోయంబత్తూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఇద్దరినీ ఢీకొట్టింది. దీంతో వారిద్దరూ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. రైల్వే పోలీసులు దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**రోడ్డు ప్రమాదంలో ఐదుగురు**

మరోవైపు, గురువారం జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. అల్లూరి జిల్లా చింతపల్లి మండలం లంబసింగి ఘాట్ రోడ్డులో వ్యాన్, బైక్ ఢీకొని ఇద్దరు మృతి చెందారు. పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అటు, ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం ఆత్కూర్ క్రాస్ రోడ్డు వద్ద జరిగిన మరో ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. లారీ, ఆటో ఢీకొని డ్రైవర్ సహా మరో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంలో మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండగా.. వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. లారీ డ్రైవర్ అతి వేగమే ప్రమాదానికి కారణమని స్థానికులు చెబుతున్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విశాఖ జిల్లా పద్మనాభం మండలం కురపల్లి గ్రామంలో ఓ ప్రైవేటు రిసార్టులో పుట్టినరోజు వేడుకలు విషాదం నింపాయి. స్నేహితులతో కలిసి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న అభిషేక్ వంశీ (24) అనే వ్యక్తి మద్యం తాగి స్విమ్మింగ్ ఫూల్‌లో దిగి ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడు ఎంవీపీ కాలనీగా చెందినవాడిగా గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**విశాఖలో అగ్నిప్రమాదం**

అటు, విశాఖ జైలు రోడ్డులో ఉన్న ఎస్బీఐ మెయిన్ బ్రాంచ్‌లో గురువారం ఉదయం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. కార్యాలయంలో మంటలు చెలరేగగా.. స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని 3 ఫైరింజన్లతో మంటలు అదుపులోకి తెచ్చారు. మంటల్లో కంప్యూటర్లు, విలువైన డాక్యుమెంట్లు కాలి బూడిదయ్యాయి. ఈ ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమని ప్రాథమికంగా భావిస్తున్నారు. అయితే, దీపావళి రోజున సెలవు కావడంతో సిబ్బంది సైతం ఎవరూ లేకపోవడం మంటలు చెలరేగడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిగిన తర్వాతే వివరణ ఇస్తామని అధికారులు తెలిపారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# జార్ఖండ్ లో భట్టి విస్తృత ప్రచారం



**జయభేరి, రాంచీ నవంబర్ 1:** మరికొన్ని రోజుల్లో ఎన్నికలు జరగనున్న ఝార్ఖండ్ రాష్ట్రంలోని భోకారో ప్రాంతంలో తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రత్యేక పరిశీలకుడిగా పర్యటిస్తున్నారు. అక్కడి ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించిన భట్టి.. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై దిశానిర్దేశం చేసారు. ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాగైనా కాంగ్రెస్ కూటమిని విజయ తీరాలకు చేర్చాలని భావిస్తున్న ఏఐసీసీ.. భట్టి సహా కీలక నాయకులకు అక్కడ సమన్వయ బాధ్యతలు అప్పగించింది. దీంతో.. ఝార్ఖండ్ లో పర్యటిస్తున్న భట్టి విక్రమార్క కాంగ్రెస్ వ్యూహాలకు పదును పెడుతున్నారు.రాష్ట్రంలోని ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముందు ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా నివాళి అర్పించిన భట్టి విక్రమార్క.. దేశం ఆధునికత దిశగా సాగడంలో ఇందిరా గాంధీ మరువలేదని వ్యాఖ్యానించారు. దేశాభివృద్ధికి ఇరవై సూత్రాల పథకం, బ్యాంకుల జాతీయాకరణ, గరీబీ హటావో నినాదంతో ఈ దేశ భవిష్యత్తుపై ఇందిరా గాంధీ చెరగని ముద్ర వేశారని కొనియాడారు. ప్రస్తుత బీజేపీ నాయకుల చేతిలో దేశం నానాటికి వెనక్కి వెళుతుందని విమర్శించిన భట్టి విక్రమార్క.. సంపన్న పెట్టుబడి దారులు ఈ దేశాన్ని దోచుకుంటున్నారని దుయ్యబట్టారుదేశాన్ని రక్షించడం కోసం, రాజ్యాంగ మౌళిక సూత్రాలను కాపాడడంతో పాటు దేశ వనరులను కాపాడుకోవాలంటే ఇండియా కూటమికి ఓటు వేసి కూటమిని గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలంతా సమన్వయంగా పనిచేస్తే ఇండియా కూటమి ఝార్ఖండ్ లో ఘనవిజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. భోకారో అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్వేతా సింగ్ ను గెలిపించి, చట్ట సభకు పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భోకారో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఉమేష్ గుప్త, మనోజ్ సింగ్ ఏఐసీసీ మెంబర్ సుశీల్ ఝా, ఉమేష్‌గుప్తా సహా కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.ఇటీవల ఎన్నికలు జరిగిన హరియాణాలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని అంతా భావించారు. కానీ.. ఓటమి పాలయ్యారు. దీంతో.. త్వరలోనే ఎన్నికలు జరగనున్న మహారాష్ట్ర, ఝార్ఖండ్ రాష్ట్రాల్లో ఎలాగైనా అధికారంలోకి రావాలని భావిస్తున్న కాంగ్రెస్ పార్టీ.. అక్కడి డివిజన్లకు జాతీయ నాయకుల్ని ప్రత్యేక పరిశీలకులుగా కొందరిని నియమించింది. తెలంగాణ నుంచి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్కలను ఏఐసీసీ ఆయా రాష్ట్రాల్లో సమన్వయ కర్తలుగా నియమించింది. మహారాష్ట్రలోని 288 స్థానాలకు నవంబర్ 20న ఒకే విడుతలో ఎన్నికలు జరగనుండగా.. జార్ఖండ్‌లో ఉన్న 81 స్థానాలకు నవంబర్ 13, 20 తేదీల్లో రెండు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. కాగా... రెండు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు నవంబర్ 23వ తేదీన వెలువడనున్నాయి.



# భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్త పాదయాత్ర

■ పార్టీ నేతలపై వేధింపులు, అక్రమ కేసులు పెడుతున్న పోలీసులపై కఠిన చర్యలు

**జయభేరి, హైదరాబాద్:** పార్టీ కార్యకర్తలు అంతా కోరుతున్నందున భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్రను నిర్వహిస్తానని భాతర రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఅర్ తెలిపారు. దీపావళిరోజు నెటిజన్లతో జరిగిన సామాజిక మాధ్యమం ఎక్స్ సంభాషణ అక్స్ కెటిఅర్ లో ఈ మేరకు కెటిఅర్ తెలిపారు. పలువరు ప్రత్యేకంగా ఈ అంశంలో కెటిఅర్ అభిప్రాయాన్ని కోరారు. దేశంలోని అనేక పార్టీల నేతలు, ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టడంతో పాటు, పార్టీలను బలోపేతం చేసేందుకు పార్టీ అధ్యక్షులు పాదయాత్రలు చేస్తున్నారు, మీరెప్పుడు చేస్తారని అడిగారు. దీనికి స్పందించిన కెటిఅర్ ఖచ్చితంగా తన పాదయాత్ర ఉంటుందని వెల్లడించారు. దాదాపు గంటన్నపాటు సాగిన ఈ సంభాషణలో కెటిఅర్ అనేక అంశాలపై తన అభిప్రాయాలను ప్రజలతో పంచుకున్నారు. తెలంగాణ రాష్ట్రానికి కాంగ్రెస్ పాలన ఒక శాపంగా మారిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే ఉద్దేశాలు ఏమాత్రం లేవు... అందుకే అబద్ధాల మీద, అసత్యాల మీద సమయం గడుపుతూ ప్రజలను మోసం చేస్తున్నారు. గత పది నెలల కాలంలో కాంగ్రెస్ పార్టీ చేసిన ఒక్క మంచి కూడా గుర్తుకు రావడం లేదన్నారు. అబద్ధపు హామీల మీద ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ నుంచి ఇంతకంటే గొప్ప పరిపాలన ఆశించలేమన్నారు, తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు రాజకీయ వేధింపులను ప్రారంభించింది అన్నారు. అయితే వీటికి భయపడేది లేదని కేటీఆర్ అన్నారు. సన్నవడ్లకు కూడా బోనస్ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ హామీ బోగస్‌గా మారిందని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మి ఓట్లు వేసి మద్దతు ధర లేక రైతుబంధు లేక నష్టపోతున్న రైతన్నల తరపున పోరాడుతామన్నారు. కాంగ్రెస్ పార్టీ పాలన ఫ్రమ్ ఢిల్లీ, టూ ఢిల్లీ, ఫర్ ఢీల్లీ అన్నట్లుగా తయారైందని ఎద్దేవా చేశారు. నాలుగు సంవత్సరాల తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారం పోవడం ఖాయమని అయితే కొత్త ప్రభుత్వానికి ఈ ప్రభుత్వం చేసిన నష్టం నుంచి తెరుకొని ముందుకు తీసుకుపోవడం అతిపెద్ద సవాలుగా మారుతుందని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ఆర్థిక ప్రగతి పూర్తిగా పతనం అయిందన్నారు. అన్ని రంగాల్లో తెలంగాణ రాష్ట్రం వెనక్కి పోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆదాయ వనరులు నుంచి మొదలుకొని వ్యవసాయ రంగం, అన్ని రంగాలు తిరోగమనంలో ఉన్నాయన్నారు. నిరుద్యోగితక పెరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి అనేక కంపెనీలు వదిలి వెళ్ళిపోతున్నాయన్నారు. ఈ అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి ప్రణాళికలు ఉన్నాయో ఎవరికి తెలియడం లేదన్నారు. కాంగ్రెస్ పాలన వలన జరుగుతున్న నష్టాన్ని పూడ్చుకోవడం అప్పుడప్పుడే సాధ్యం కాదు అన్నారు. పార్టీ కార్యకర్తల ఆకాంక్షల మేరకు భవిష్యత్తులో రాష్ట్ర వ్యాప్త పాదయాత్ర

# సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే

■ సర్వేలో అన్ని వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలి - కలెక్టర్ గౌతమ్

**జయభేరి, నవంబర్ 1:**

సమగ్ర ఇంటింటి సర్వేను విజయవంతం చేయాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను అధికారులు శామీర్ పేట లో నిర్వహించారు. కాగా ఈ సర్వేను మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ మరియు అదనపు కలెక్టర్ రాధిక గుప్త కలిసి పరిశీలించారు. అనంతరం సర్వేలో భాగంగా ఇంటింటికి అతికించిన స్టిక్కర్లు పరిశీలించి సర్వేకు సంబంధించిన ప్రో ఫార్ములాను కూడా పరిశీలించి కుటుంబ సభ్యుల వివరాలు ఏ విధంగా నమోదు చేస్తున్నారు మరియు వారిని ఏయే ప్రశ్నలు అడుగుతున్నారని ఎన్యుమరేటర్లను అడిగి తెలుసుకున్నారు. అన్ని వివరాలను ప్రోఫార్మా ప్రకారం పూర్తి చేసి సంబంధిత అధికారులకు అందచేయాలని సూచించారు. అదేవిధంగా సర్వేకు సూపర్ వైజర్ లు, ఎన్యూమరేటర్లు హాజరవుతున్నరా లేదా అని ఎంపిడివో మమతాబాయిని అడిగి తెలుసుకున్నారు. ఇక ఆధార్ కార్డు, ఓటరు కార్డు ఉన్న వారి వివరాలను కూడా తప్పక నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు, ఈ కార్యక్రమంలో ఎంపీఓ వినూత్న, కార్యదర్శి మౌనిక, ఆశ వర్కర్లు, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.





## కాలభైరవ ఆశీస్సులతో..

**జయభేరి, ఉప్పల్ :**

ఉప్పల్ భగాయత్ లో అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఆ కాలభైరవ స్వామి ఆశీస్సులతో ఉప్పల్ నియోజకవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ BRS పార్టీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందజేత



**జయభేరి, గజ్వేల్, నవంబర్ 01 :**

సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం పాములపర్తి గ్రామంలో బుధవారం కొనమైన మదురి అనారోగ్యం కారణంగా మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న మార్కుక్ మండల్ బిసి సెల్ అధ్యక్షుడు సిద్దిపేట్ జిల్లా ముదిరాజ్ సంఘం ఉప అధ్యక్షుడు మ్యాకల కనకయ్య ముదిరాజ్ మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు వారితో పాటు కొనమైన నర్సింలు, కోణమైన కృష్ణ,లింగం, సాధుల్లా, స్వామి దుర్గేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు



## కాంట్రాక్టర్ల పై ఒత్తిడి సరికాదు

■ కీసర ఎలక్ట్రికల్ ఆపరేషన్ డీఈ లింగయ్య గౌడ్ నిర్లక్ష్య వైఖరి మానుకోవాలి

**జయభేరి, కీసర, నవంబర్ 1:**

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కీసర మండలంలోని ఎలక్ట్రికల్ ఆపరేషన్ డిఈ లింగయ్య గౌడ్ నిర్లక్ష్య వైఖరిపై మండిపడుతున్న కాంట్రాక్టర్లు. ఎలక్ట్రికల్ ఆపరేషన్ డీఈ గా చార్జ్ తీసుకుని ఇరవై రోజులు అవుతున్న ఒక్క సాంక్షన్ ఫైల్ మీద కూడా ఇంతవరకు సంతకం చేయలేదని వారి ఆవేదన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్టర్లు. డబ్బులు ఇస్తేనే ఫైల్ మీద సంతకం చేస్తారా లేకపోతే చేయరా డబ్బుల కోసమేనా అనే అనుమానం కూడా వ్యక్తం అవుతుందన్నారు. ఒక పక్క ప్రజలు మాకు పనులు అవ్వడం లేదు అని మాపైన చాలా ఒత్తిడి చేస్తున్నారు. సాంక్షన్ ఫైల్ మీద సంతకం చేయకుండా ఫైల్ సాంక్షన్ చేయనప్పుడు మేము ఎలా పనులు చేయాలి, ఫైల్ సాంక్షన్ కానప్పుడు ఎక్కడి పనులు అక్కడే ఆగిపోవడంతో ప్రజలు మమ్మల్ని దుమ్మెత్తి పోస్తున్నారని, ఇప్పటికైనా డీఈ మా బాధను అర్థం చేసుకొని సాంక్షన్ ఫైల్ మీద సంతకాలు చేసి ఫైళ్లను సాంక్షన్ చేయాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు.

## శాకారం లో ట్రాక్టర్ దొంగతనం

**జయభేరి, గజ్వేల్, నవంబర్ 01 :**

ట్రాక్టర్ ని దొంగతనం చేసిన ఘటన శాకారం గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై కరుణాకర్ రెడ్డి వివరాల ప్రకారం వర్గల్ మండలం శాకారం గ్రామనికి చెందిన గరుగుల రమేష్ (40) ఐదు నెలల నుండి వర్గల్ గ్రామానికి చెందిన వేలూరి కిష్టారెడ్డి వద్ద పనిచేస్తున్నాడు. కిష్టారెడ్డి దగ్గర నుండి తీసుకొని గురువారం రాత్రి 10 గంటల సమయంలో తన వ్యవసాయ పొలంలో ట్రాక్టర్ ను వదిలి వెళ్ళాడు. ఉదయం 5:30 సమయంలో వెళ్లి చూడగా ట్రాక్టర్ ను ఎవరో దొంగతనం చేశారని చెప్పారు.ఫిర్యాదు పై కేసు నమోదు చేసి సీసీ కెమెరాలు ద్వారా దర్యాప్తు చేస్తామని ఎస్సై వివరించారు.

## గుండాల మండలంలో కలెక్టర్ తనిఖీలు

**జయభేరి, యాదాద్రి:**

యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం లో జిల్లా కలెక్టర్ ఎం హనుమంతరావు ఆకస్మిక తనిఖీ చేసారు. మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం లో పలు రికార్డులు పరిశీలిస్తూ సమస్యల పరిష్కార దిశగా కృషి చేయాలని తహసిల్దార్ కు సూచించారు. అనంతరం పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి సీఈఓ నాగయ్య, ఏఈఓ క్రాంతి కుమార్ లకు షోకాస్ నోటీసులు జారీ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కనీస అవసరాలు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను సందర్శించి రిజిస్టర్లను తనిఖీ చేసి వైద్య సిబ్బంది వివరాలు , రోగులకు అందుతున్నటువంటి సేవలను డాక్టర్ హైమావతిని అడిగి తెలుసుకుని మారుమూల ప్రాంతంలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని సూచనలు సలహాలు చేశారు.

# బోడుప్పల్ కార్పోరేషన్ లో రూ.7 కోట్లతో అభివృద్ధి

**జయభేరి, మేడిపల్లి :**



మేడ్చల్ నియోజకవర్గం లోని బోడుప్పల్ మున్సిపల్ కార్పోరేషన్ లో అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలో రాష్ట్ర మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుతో కలిసి పాల్గొన్న మల్కాజిగిరి ఎంపి, బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు ఈటల రాజేందర్. బోడుప్పల్ మున్సిపల్ కార్పోరేషన్ లో రూ.7 కోట్ల అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన మంత్రి శ్రీధర్ బాబు, ఎంపీ ఈటల రాజేందర్. 7వ డివిజన్ గాయత్రి నగర్ లో సిసి రోడ్ పనుల ప్రారంభం. 20వ డివిజన్ చిలకనగర్ మెయిన్ రోడ్డు లోని HP పెట్రోల్ పంప్ వద్ద డ్రైనేజీ లైన్ పనులకు, 1 28 డివిజన్ లకు అంబేద్కర్ విగ్రహం వద్ద తాగునీటి పైప్ లైన్ల పనులు. 3వ డివిజన్ లోని శ్రీ రెసిడెన్సి కమ్యూనిటీ హాల్ వద్ద సిసి రోడ్ పనులు. 1వ డివిజన్ లో ని క్రాంతి కాలనీ రోడ్ నెంబర్ 4 లో బీటీ రోడ్డు పనులు. 15వ డివిజన్ లో బుల్లిగూడెం చౌరస్తాలో సిసి రోడ్డు పనుల కార్యక్రమం. ఈ కార్యక్రమంలో తెలంగాణ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, మేయర్ అజయ్ యాదవ్, కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పది నెలల కాలంలో గజ్వేల్ అభివృద్ధి శూన్యం..!

■ ఆంధ్రాలో తెలంగాణను విలీనం చేస్తావా రేవంత్ రెడ్డి

**జయభేరి, గజ్వేల్, నవంబర్ 01 :**



కరువులో ఉన్న తెలంగాణను కోటి ఎకరాల మాగానిగా, అన్నపూర్ణగా తీర్చిదిద్దిన ఘనత కెసిఆర్ దేనిని రాష్ట్ర మాజీ ఎఫ్డిసి చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి అన్నారు. రాష్ట్రం సమస్యల్లో కూరుకు పోయిందని, ఉద్యోగులు, రైతులు, విద్యార్థులు, పోలీసులు కూడా ప్రభుత్వంపై వ్యతిరేకతతో రోడ్డెక్కుతున్నారని, త్వరలో కోటి యాభై లక్షల మహిళలు కూడా రోడ్డెక్కే పరిస్థితి ఉందన్నారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ కుదేలైందని, అందరి ఆర్థిక పరిస్థితి చిన్న భిన్నం అయిందన్నారు. హైడ్రాతో ప్రజలకు సమస్యలు సృష్టిస్తున్నారని, సరైన విధివిధానాలు లేకుండా పాలన సాగుతుందన్నారు. ఎక్సైజ్, విద్యుత్, ఆర్టీసీ ధరలు కూడా పెంచుతామంటున్నారన్నారు. రాబడి కోసం రాష్ట్రంపై రాబందులా పడ్డారని సీఎం రేవంత్ రెడ్డి పై ప్రతాప్ రెడ్డి ఆరోపించారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను ఎన్ని రకాలుగా ఇబ్బంది పెట్టినా, ప్రతిపక్షం బలంగా ఉందని ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడుతూనే ఉంటామన్నారు. ప్రజలకు ఎన్నికల్లో హామీ ఇచ్చిన 6 గ్యారంటీల ఇలా అమలులో విఫలమయ్యారని, ఎందుకు నైతిక బాధ్యత వహిస్తూ సీఎం రేవంత్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలన్నారు..రాష్ట్రవ్యాప్తంగా రైతు భరోసా అమలు కాక రైతులంతా ఇబ్బంది పడుతున్నారని, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలు జరుగుతున్నాయని, పత్తి కొనుగోలు కేంద్రాలు ఇప్పటివరకు ఏర్పాటు చేయలేదని రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతుల కోసం రైతు గర్జన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని టిఆర్ఎస్ పార్టీ నేరుగా రైతుల లోకి వెళ్లి సమస్యలను పరిశీలించి పరిష్కరించడానికి ఉద్యమిస్తామన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జక్కియుద్దిన్, కౌన్సిలర్ బాలమణి శ్రీనివాస్ రెడ్డి, ఉప్పల మెట్టయ్య, అత్తెల్లి శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడు నవాజ్ మీరా, మండల పార్టీ అధ్యక్షుడు బెండ మధు, నాయకులు కనకయ్య, మల్లేశం, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

# ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలంటూ గ్రామస్తుల నిరసన

■ ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా అధికారులకు పట్టించుకోవడం లేదంటూ ఆవేదన వ్యక్తం

**జయభేరి, గజ్వేల్ ములుగు :**




రాజీవ్ రహదారి అనుకుని ఉన్న కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని కొంతమంది వ్యక్తులు అక్రమంగా కబ్జా చేసుకుని బెదిరింపులకు పాల్పడుతున్నారని లక్ష్మక్కపల్లి గ్రామస్తులు ధర్నాకు దిగారు. ములుగు మండలం లక్ష్మక్కపల్లి చౌరస్తా వద్ద రాజీవ్ రహదారికి అనుకునీ ఉన్నా ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని నినాదాలు చేస్తూ శుక్రవారం గ్రామస్తులు ధర్నాకు దిగారు.

సర్వే నంబర్ 107లో 20 గుంటల ప్రభుత్వ స్థలాన్ని కొంతమంది వ్యక్తులు పట్టా భూమిలో హోటళ్ల నిర్మాణం చేసుకుని ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేశారని గ్రామస్తులు వాపోతున్నారు. ఇదే విషయమై పలుమార్లు అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని గ్రామస్తులన్నారు. గతంలో ఇదే స్థలంలో గ్రామ పంచాయితీ నర్సరీ ఉండగా గ్రామస్తులను బెదిరింపులకు గురిచేసి నర్సరీ తొలగించారని వారు తెలిపారు. అదేవిధంగా ఈ హోటళ్ల నుండి వచ్చే వ్యర్థాలను సైతం యదేచ్చగా గ్రామ పంచాయితీ డ్రైనేజ్ కి కలిపారని వారు వాపోతున్నారు. ఇలా స్థలం కబ్జాకు గురికావడంతో మార్కెట్ నుండి వచ్చే వాహనాలకు ఇబ్బందులు ఏర్పడి రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయంటూ వారు తెలిపారు.ఇకనైనా సంబధిత అధికారులు చొరవచూపి కబ్జాకు గురైన స్థలాన్ని కపాడాలని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా మా పట్టా భూమి ముందున్న స్థలంపై మాకే చెందుతుంది కదా అంటూ పట్టదారులు చెపుతున్నారు.

## వాహనం ఢీకొట్టడంతో గుర్తుతెలియని వ్యక్తి మృతి

**జయభేరి, గజ్వేల్, నవంబర్ 01 :**

గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన గజ్వేల్ రాజీవ్ రహదారిపై సురభి కాలేజీ దగ్గర్లో శుక్రవారం ఉదయం మూడు గంటల సమయంలో చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న గజ్వేల్ సిఐ సైదా సంఘటన స్థలానికి చేరుకుని చూడగా ఒక వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తల ఛిద్రమై రెండువైపులా గుర్తుపట్టకుండా ఉండడంతో గజ్వేల్ గవర్నమెంట్ హాస్పిటల్ మార్చురీలో భద్రపరచడం జరిగిందన్నారు. మృతుని వయస్సు 30 నుండి 35 సంవత్సరాలు ఉంటాయని, వైలెట్ కలర్ టీ షర్టు, కుడి చేతిపై టాటూ జేలంధర్ అని పచ్చబొట్టు ఉందన్నారు. అతను లైట్ బ్లూ కలర్ లుంగీ కట్టుకుని ఉన్నాడని, పింక్ కలర్ చెద్దరీ ఉందన్నారు. పై మృతున్ని ఎవరైనా గుర్తుపడితే 8712667331, 8712667460, గజ్వేల్ పోలీసులకు సమాచారం అందించాలని గజ్వేల్ ఇన్స్పెక్టర్ సైదా ఒక ప్రకటనలో తెలిపారు.

## ఇంట్లో బంగారం ఆభరణాలు, డబ్బులు చోరీ...

■ తాళం వేసిన ఇండ్లే టార్గెట్ గా చేసున్న దొంగలు



**జయభేరి, గజ్వేల్, నవంబర్ 01 :**

తాళం వేసి ఉన్న ఇండ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలు చేస్తున్నారు కేటుగాళ్లు.గజ్వేల్ సిఐ సైదా వివరాల ప్రకారం గజ్వేల్ పట్టణంలోని సంగాపూర్ రోడ్డులో నివాసముంటున్న రఘుపతి మూడు రోజుల క్రితం కుటుంబ సభ్యులతో హైదరాబాద్ వెళ్లాడు. శుక్రవారం తిరిగి ఇంటికి వచ్చి చూడగా దొగతనం జరిగినట్లు నిర్ధారించారు . ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయని ఇంట్లో నుంచి ఆరు తులాల బంగారు ఆభరణాలతో పాటు, 65 వేల నగదును అపహరించుకు పోయినట్లు ఆయన తెలిపారు. వెంటనే గజ్వేల్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో రంగంలోకి దిగిన పోలీసులు క్లూస్ టీం ఆధారాలు సేకరిస్తున్నారు. దొంగల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు గజ్వేల్ సీఐ సైదా తెలిపారు.

## కాలిన గాయాలతో యాచకుడి హల్ చల్

**జయభేరి, హైదరాబాద్:**

బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12లో గుర్తు తెలియని వ్యక్తి ఒంటికి నిప్పంటించుకుని హల్ చల్ చేశాడు. తీవ్రగాయాలైన అతడిని చికిత్స నిమిత్తం ఉస్మానియా హాస్పిటల్ కి తరలించారు పోలీసులు. రోడ్లమీద భిక్షాటన చేస్తూ జీవనం సాగించే వ్యక్తిగా గుర్తించారు పోలీసులు. అసలేం జరిగిందంటే.. అక్టోబర్ 31న దీపావళి సందర్భంగా శ్మశాన వాటికలో చనిపోయిన వారికోసం ఏర్పాటు చేసిన మందు కల్లు తాగి అక్కడే పడిపోయాడు బాధితుడు. శ్మశానంలో ఉన్న దీపం అతని మీద పడడంతో మంటలు ఒంటిపైకి పాకాయి.

# ఉచిత గ్యాస్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

✍ జయభేరి, పరవాడ:

పరవాడ గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం అర్హులైన పేద కుటుంబాల వారికి ఆంధ్రప్రదేశ్ పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేసే దీపం పథకం 2 కార్యక్రమం లో ముఖ్యఅతిథిగా పాల్గొని అర్హులైన పేదవారికి ఉచిత గ్యాస్ సిలిండర్ ను పెందుర్తి నియోజకవర్గం శాసనసభ సభ్యులు పంచకర్ల రమేష్ బాబు అందజేసారు వీరితో పాటు పెందుర్తి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ గండి బాబ్జి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 1998.వ సంవత్స రంలోఅప్పటి ప్రధాన మంత్రి అటల్ బిహార్ వాజ్ పాయ్, ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కలిసి మహిళలకి దీపం పథకం క్రింద 20,లక్షల గ్యాస్ కనక్షన్లు ఉచితంగా ఇచ్చారన్నారు.మరల ఇప్పుడు సంత్సరానికి మూడు సిలెండర్లు ఇస్తున్నట్టు అటువంటి వంటి ఘనత ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి దక్కుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో పరవాడ మండల అధ్యక్షుడు పంచకర్ల ప్రసాద్ రావు,పరవాడ సర్పంచ్ ఎస్ అప్పలనాయుడు,పరవాడ మండలం ఎంపీడీవో,ఎమ్మార్వో,మాజీ జెడ్పిటిసి సభ్యులు పైలా జగన్నాదరావు,తెలుగుదేశం పార్టీ మండల పార్టీ అధ్యక్షులు వియ్యాపు చిన్న , జనసేన పార్టీ మండల అధ్యక్షులు బొడ్డపు శ్రీనివాసరావు గారు కన్నురు రమణగ, బుగిడి రామ గోవింద్ మరియు పరవాడ మండలం వివిధ గ్రామాలకు సంబంధించిన సర్పంచులు ఎంపీటీసీలు పరవాడ మండలం జనసేన పార్టీ తెలుగుదేశం పార్టీ, బిజెపి పార్టీల నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.








## టిడిపి సభ్యత్వం నమోదు కార్యక్రమం

✍ జయభేరి, పరవాడ:

పరవాడ గ్రామం లో పెందుర్తి నియోజకవర్గం టీడీపీ ఇన్చార్జి గండి బాబ్జీ ఆధ్వర్యంలో ఇంటి ఇంటికి టిడిపి సభ్యత్వం నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి మాట్లాడుతూ మండలంలో టీడీపీ నాయుకులు అందరూ సభ్యత్వం కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.ఈ కార్యక్రమంలో పరవాడ మాజీ జడ్పీటీసీ పైల జగన్నాథరావు,మాజీ ఎంపీపీ మాసవరుపు అప్పలనాయుడు,టీడీపీ ముఖ్య నాయుకులు కన్నూరు వెంకటరమణ, పరవాడ మండలం టీడీపీ పార్టీ అధ్యక్షుడు వియ్యపు చిన్న ,నాయుకులు చింతాకాయలు ముత్యాల ,ఇందల కోండారావు ,పైల రామచంద్రా రావు తదితరులు మరియు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాలుష్య గ్రామాలను తరలింపుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాలి



✍ జయభేరి, పరవాడ:

పరవాడ మండలంలో ఫార్మా తీవ్ర కాలుష్యానికి గురి కాపాడుతున్న తాడి గ్రామాన్ని అలాగే ఎన్టిపిసి కాలుష్యంతో అల్లాడుతున్న మూల స్వయంవరం,సోమనాయుడుపాలెంగ్రామాలను వెంటనే తరలించడానికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ శుక్రవారం డిమాండ్ చేశారు. ఫార్మా ఎన్టిపిసి కాలుష్యాలతో కిడ్నీ, చర్మం, ఊపర్తిత్తులు, గుండె, శ్వాస, క్యాన్సర్ వంటి జబ్బులతో ప్రజల అల్లాడుతున్నారని వెంటనే గ్రామాలు తరలించడానికి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం చర్యలు చేపట్టాలని గని శెట్టి డిమాండ్ చేశారు ఇప్పటికే తీవ్ర కాలుష్యాన్ని గురైనట్లు సెంట్రల్ పొల్యూష్యన్ కంట్రోల్ బోర్డు అధికారులు నివేదిక సిద్ధం చేసి ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని దీనివలన ఫార్మా పరిశ్రమల నుండి విడుదలవుతున్న వ్యర్ధ రసానికి జలాలను రాంకీ యజమాన్యం శుద్ధి చేయకుండా ముల్లోడు గడ్డ, ఊర చెరువు,పెద్ద చెరువు, సన్యాసి చెరువు తీవ్ర కాలుష్యంతో దుర్గంధం వెలబడుతుందని వెంటనే కాలుష్యం అరికట్టడానికి మండల ప్రజల జీవించడానికి స్వచ్ఛమైన గాలి, నీరు, నేల ఉండేలా కాపాడాలని గని శెట్టి డిమాండ్ చేశారు. కాలుష్యాన్ని గురైన తాడి, మూల స్వయంవరం, సోమనాయుడుపాలెం గ్రామాలను తరలించాలని డిమాండ్ చేశారు. స్థానిక నిర్వాసితులకు ఫార్మా ఎన్టిపిసిల్లో ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు.

## ఎన్టీఆర్ భోరోసా పెన్షన్



✍ జయభేరి, పరవాడ:

మండల కేంద్రం అయ్యిన పరవాడ బీసీ కాలనీలో రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ భోరోసా పథకం క్రింద ఇస్తున్న పెన్షన్ కార్యక్రమంలో పెందుర్తి ఎమ్మెల్యే పాల్గొని అవ్వ,తాతలకు పెన్షన్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పైల జగన్నాధరావు,సర్పంచ్ ఎస్ అప్పలనాయుడు,మాజీ ఎంపీపీ మసవరపు అప్పలనాయుడు, టీడీపీ నాయుకులు పైల రామచంద్ర రావు,వియ్యపు చిన్న, జనసేన నాయుకులు దుల్ల రామునాయుడు, బొద్ధపు అయ్యబాబు, కూటమి నాయుకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పల్లె పండగ అభివృద్ధి పనుల నాణ్యతలను పరిశీలించిన ఎమ్మెల్యే



✍ జయభేరి, పరవాడ:

పెందుర్తి నియోజకవర్గం పరవాడ మండలం పెద ముసిడివాడ గ్రామంలో క్రితంలో పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ పనులను ఎంజిఎన్ఏఆర్జిఎస్ నిధులతో సీసీ రోడ్లు మరియు డ్రైన్స్ పనులను అవ్వుతు ఉండడంతో ఈ యొక్క అభివృద్ధి పనుల నాణ్యతలను పరవాడ మండలం ఎంపీడీవోతో కలిసి పెందుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు పరిశీలించారు.వీరితో పాటు ఉమ్మడి ఎన్ డి ఎ మహాకూటమి నాయకులు పాల్గొన్నారు.

## శంషాబాద్ లో భారీగా డ్రగ్స్ పట్టివేత

✍ జయభేరి, రంగారెడ్డి:

శంషాబాద్ విమానాశ్రయంలో అధికారులు పెద్ద ఎత్తున డ్రగ్స్ పట్టుకున్నారు. బ్యాంకాక్ నుండి హైదరాబాద్ వచ్చిన ఇద్దరు ప్రయాణికుల నుండి 7 కోట్ల విలువచేసే విదేశీ గంజాయినీ డిఆర్ఐ అధికారులు పట్టుకున్నారు. కెల్లోస్ చాక్లెట్ ప్యాకెట్ల అంతర్భాగంలో గంజాయినీ నిందితులు ప్యాకింగ్ చేసుకొని వచ్చారు. ఇద్దరు నిందితుల నుండి 13 ప్యాకెట్లలో 7.096 కిలోల విదేశీ గంజాయి తెచ్చారు. పట్టుబడ్డ గంజాయి విలువ 7 కోట్లు ఉంటుందని డిఆర్ఐ అధికారులు ప్రకటించారు.

## బిఆర్ఎస్ పార్టీలో చేరికలు మొదలు

✍ జయభేరి, దేవరకొండ :



ఎన్నికల హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం అయిందని నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. శుక్రవారం దేవరకొండ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పట్టణంలోని 3వ వార్డుకు చెందిన మొహమ్మద్. నజీర్ 17వార్డుకు చెందిన దరమల్ల వినియ్, మాజీ ఎమెల్యే రవీంద్ర కుమార్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది నెలల కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు రోడ్ల మీదకు వచ్చి నిరసనలు తెలిపే పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. బడికి పోయే పిల్లల నుండి పింఛన్లు అందుకునే అవ్వా తాతల దాకా రోడ్లు ఎక్కారంటే ఆ ఘనత రేవంత్ రెడ్డిదే అని తెలిపారు.

కేసీఆర్ బతుకమ్మ పండుగ వేల చీరెలు ఇచ్చిండు. కేసీఆర్ కిట్లు, న్యూట్రీషన్ కిట్లు ఇచ్చిండు, చెరువుల్లో చేపలు వేసిండు. గొర్రెలు ఇచ్చిండు కేసీఆర్ ప్రభుత్వం పోయాక అన్నీ పోయాయని గుర్తు చేశారు. నేడు 10వేలు, రేపయితే 15వేల రైతు భరోసా అన్నరు. ప్రజలు నమ్మితే నట్టేట ముంచారు.కరోనా సమయంలోనూ కేసీఆర్ రైతు బంధు ఆపలేదని, మంత్రుల, ఎమ్మెల్యేల జీతాలు ఆపి మరీ రైతులకు రైతు బంధు ఇచ్చిండని తెలిపారు. ఇప్పుడు కరోనా లేదు ఎందుకు, రైతు బంధు పడలేదు, 15వేలు పడలేదు, కేసీఆర్ ఇచ్చే పది వేలు పడలేదు, రైతులను ఘోరంగా మోసం చేశారని అన్నారు. ఆరు గ్యారెంటీల బాధ్యత నాది అని చెప్పిన సోనియా గాంధీ ఎక్కడున్నారని అన్నారు. కాంగ్రెస్ వికృత వైఖరి పట్ల గ్రామ గ్రామాన చర్చలు పెట్టాలని,ప్రజలు, రైతులు, యువత అందరికీ అర్థమయ్యేలా వివరించాలని కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అద్యక్షులు టీవీఎన్ రెడ్డి, బిఆర్ఎస్వీ నియోజకవర్గ అద్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ,యువజన విభాగం పట్టణ అద్యక్షులు పొట్ట మదు, బాబా, అఫ్రోజ్, చంద్రమౌళి(CM), చాట్ల రాములు, మైనంపల్లి ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా సమగ్ర కుటుంబ సర్వే

✍ జయభేరి, దేవరకొండ :



ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని దేవరకొండ ఆర్డీఓ ఎస్ రమణారెడ్డి,మునిసిపల్ కమిషనర్ వై. సుదర్శన్ సూచించారు. శుక్రవారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్ధేశించిన మార్గదర్శకాలను అనుసరించి ఇంటింటి సర్వే చేపట్టాలని ఆదేశించారు. ప్రతీ ఇంటి నుంచి స్పష్టమైన సమాచారాన్ని సేకరించాలన్నారు.

వివరాలు సేకరించిన తరువాత సర్వే ఇంటికి స్టిక్కర్ అతికించి రావాలన్నారు. ఈ నెల 6వ తేదీ నుండి సర్వే ప్రారంభమవుతుందని తెలిపారు. వెనుకబడిన తరగతులు, షెడ్యూలు తెగలు ఇతర బలహీన వర్గాల అభివృద్ధికి సరైన నిర్ణయాలు తీసుకొని అవసరమైన ప్రణాళికలు తయారుచేసి అమలు చేస్తున్నందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రతిష్టాత్మక సర్వే చేపడుతుందని పేర్కొన్నారు.

# తెలంగాణలో రెడ బుక్.. బ్లాక్ బుక్ పాలిటిక్స్

✍ జయిభేరి, హైదరాబాద్, నవంబర్ 1:

బ్లాక్ బుక్, రెడ్ డైరీ, రెడ్ బుక్ ఈ పదాలు ఇప్పుడు తెలంగాణలో ఎక్కువగా వినిపిస్తున్నాయి. మీ పేర్లు రాసుకుంటున్నాం.. అధికారంలోకి వచ్చాక అంతు తెలుస్తామంటూ బ్లాక్ బుక్, రెడ్ డైరీలను చూపిస్తున్నారు. ఇంతకీ ఎవరి పేర్లు రాస్తున్నారు.. రాసుకిని ఏం చేయబోతున్నారు? అన్నదీ రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.ఏపీ ఎన్నికలకు ముందు టీడీపీ ప్రధాన కార్యదర్శి, ప్రస్తుత మంత్రి నారా లోకేష్ ప్రతిసారీ మాట్లాడుతూ రెడ్ డైరీ ప్రస్తావించారు. అధికారుల పేర్లు రాసుకుంటున్నాను అధికారంలోకి వచ్చాక సంగతి చెప్తాను అంటూ ప్రతిసారి స్టేట్ మెంట్ ఇచ్చాడు నారా లోకేష్. ఇప్పుడు తెలంగాణలో తాజాగా అలాంటి హెచ్చరికలు వినిపిస్తున్నాయి. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి బ్లాక్ బుక్ అంటూ తెలంగాణలో ఈ కాన్సెప్ట్ మొదలుపెట్టాడు. ప్రతి ప్రెస్ మీట్ లోనూ బ్లాక్ బుక్ చూపించి అధికారులకు వార్నింగ్ ఇస్తున్నాడు.మొదటగా హుజూరాబాద్ ఆర్డీఏ అధికారులు, హుజూరాబాద్ ఎంఈవో, ఇలా కొంతమంది పోలీసు అధికారుల పేర్లు రాసుకున్నాను అంటూ ప్రకటించారు. తన ఇంటిపై దాడి జరిగినప్పుడు ఏ పోలీస్ అధికారులు ప్రత్యర్థులకు సహకరించారో వారి పేర్లను నోట్ చేసుకున్నాను అంటూ చెప్పుకొచ్చారు. ఇక తాజాగా తనపై డ్రగ్స్ కేసులో ఇరికించే కుట్ర జరిగిందని, అందుకు సహకరించిన పోలీసు అధికారుల పేర్లను మరోసారి బ్లాక్ బుక్ లో రాసుకున్నాను అంటూ చెప్పారు. వచ్చే ఎన్నికల తర్వాత అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ పార్టీ అని, అధికారంలోకి వచ్చిన తర్వాత బ్లాక్ బుక్ లో ఉన్న పేర్లు ఉన్నవారికి అన్ని బ్లాక్ డేస్ అంటూ చెప్పారు.

ఇక మాజీ మంత్రి హరీష్ రావు కూడా వనపర్తి రైతు ధర్నాలో మాట్లాడుతూ.. అత్యుత్సాహం చూపిస్తున్న పోలీస్ అధికారుల పేర్లను తాను రెడ్ డైరీలో రాసుకుంటున్నాను అంటూ బహిరంగ వేదికపైనే చెప్పారు. అధికారంలోకి వచ్చాక ఏ ఒక్కరినీ వదిలిపెట్టం అన్నారు హరీష్‌రావు. ఇదే బీఆర్ఎస్ పార్టీలోని ఇంకొంతమంది నేతలు రెడ్ బుక్ లో ఓవరాక్షన్ చేస్తున్న ఆఫీసర్ల పేర్లు రాసుకుంటున్నామంటూ చెబుతున్నారు. ఇంతకీ ఈ ప్రకటనలు దేనికి సంకేతం..అయితే అధికారులను బెదిరించడానికా అంటే కాదని ఇంటర్నల్‌గా చెప్తున్నారు ప్రతిపక్ష నేతలు. కింద స్థాయి కేడర్ కి, కార్యకర్తలకి ధైర్యం నింపడం కోసమే ఇలాంటి టెక్నిక్స్ వాడుతామని అంటున్నారు. దాంతోపాటు అధికారులను కొంత భయం ఉంటుంది.. ప్రభుత్వాలు మారితే ఇబ్బందులు ఎదుర్కొంటామని సంకేతాలు ఉంటాయని అంటున్నారు. ఆంధ్రప్రదేశ్లో రెడ్ బుక్ లో పేర్లు బయటకు రాకపోయినా కొంతమంది అధికారులు ఇప్పుడు పడుతున్న ఇబ్బందుల ఇందుకు ఉదాహరణ అని చెప్తున్నారు బీఆర్ఎస్ నేతలు. అక్కడ ఐఏఎస్, ఐపీఎస్ నేతలు కేసుల్లో ఇరుక్కుని పడుతున్న కష్టాలను చూసైనా తెలంగాణలో ఉన్న అధికారులు మారాలని కోరుతున్నారు.



## రహదారికి మరమ్మత్తులు

✍ జయభేరి, పరవాడ:

పరవాడ మండలం వెన్నెల పాలెం గ్రామంలో గత ప్రభుత్వంలో గొల్లల పాలెం సమీపంలో ఇంటింటికి కొళాయి లైన్ కోసం రోడ్డుని తవ్వేసి,సుమారు 3 సంవత్సరాలు అవ్వుతుండడంతో తవ్వేసిన రోడ్డును మరమ్మతులు చేయకపోవడం వల్ల రహదారి బాగా పాడవ్వడంతో అటుగా ప్రయాణం చేసే ప్రజానీకం చాలా ఇబ్బందికి గురవ్వాతున్నారు దీన్ని గమనించిన వెన్నలపాలెం బండారు యువసేన టీం సభ్యులు పాడైపోయిన రహదారిని మరమ్మత్తులు చేయించారు.దీనిపై గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయుకులు బండారు వీరి నాయుడు,పైల ప్రసాద్,బోజీంకి అప్పలనాయుడు, లోకిరెడ్డి సన్యాసి నాయుడు(అభి), బండారు సతీష్, పైల రమణాజి, బండారు సోమ నాయుడు, లోకి రెడ్డి దామోదర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.


## కుంభం రాములు చిత్ర పటానికి నివాళు



✍ జయభేరి, చింతపల్లి :

చింతపల్లి మండలం కుర్మెడ్ గ్రామ బిఆర్ఎస్ పార్టీ నాయకులు కుంభం శ్రీశైలం గౌడ్ తండ్రి కుంభం రాములు గౌడ్ ప్రథమ వర్ధంతి సందర్భంగా నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ కుంభం రాములు చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... రాములు గౌడ్ మరణం పార్టీకి లోటు అని ఆయన అన్నారు.ఆయన వెంట మాజీ రైతు బంధు మండల అధ్యక్షులు ఉజ్జిని విద్యాసాగర్ రావు, మాజీ ఎంపీటీసీ కుంభం స్వేత శ్రీశైలం గౌడ్,పులిరాజ్ గౌడ్,మహేష్,తదితరులు పాల్గొన్నారు.

jayabheridaily.com




# చీరకట్టులో దేవర బ్యూటీ..

దీపావళి పండగ కళ మొత్తం సోషల్ మీడియాలోనే కనిపిస్తుంది. సినీతారలు సంప్రదాయ దుస్తుల్లో అందంగా ముస్తాబై ఫోటోలకు ఫోజులిచ్చారు. టాలీవుడ్, బాలీవుడ్, కోలీవుడ్ ఇండస్ట్రీలకు చెందిన పలువురు హీరోయిన్స్ ట్రెడిషనల్ వేర్ లో కట్టిప డేశారు. అందులో జాన్వీ కూడా. ఇటీవలే దేవర సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది బాలీవుడ్ హీరోయిన్ జాన్వీ కపూర్. యంగ్ టైగర్ ఎన్టీఆర్, డైరెక్టర్ కొరటాల శివ కాంబోలో వచ్చిన ఈ సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది ఈ ముద్దుగుమ్మ. తెలుగులో తొలి చిత్రంతోనే సూపర్ హిట్ అందుకున్న ఈ వయ్యారి.. ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ సందడి చేస్తుంది. తాజాగా దీపావళి సందర్భంగా చీరకట్టులో మరింత అందంగా ముస్తాబయ్యింది జాన్వీ. తాజాగా తన ఇన్ స్టాలో షేర్ చేసిన ఫోటోల్లో జాన్వీ మరింత అందంగా.. చూడముచ్చటగా కనిపిస్తూ స్పెషల్ అట్రాక్షన్ అవుతుంది. దేవర సినిమా తర్వాత ఈ మూవీ పార్ట్ 2లోనూ కనిపించనుంది. దివంగత హీరోయిన్ శ్రీదేవి నటవారసురాలిగా సినీరంగంలోకి అడుగుపెట్టింది జాన్వీ కపూర్. ధడక్ సినిమాతోనే బాలీవుడ్ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చి..ఫస్ట్ మూవీతోనే సూపర్ హిట్ అందుకుంది. ఆ తర్వాత హిందీలో బ్యాక్ టూ బ్యాక్ హిట్ చిత్రాల్లో నటిస్తూ తక్కువ సమయంలోనే స్టార్ డమ్ అందుకుంది. హీరోయిన్ పాత్రలే కాకుండా లేడీ ఓరియెంటెడ్ చిత్రాలతో ప్రేక్షకులకు దగ్గరయ్యింది. ఇదిలా ఉంటే.. సినిమాలే కాకుండా జాన్వీ కపూర్ పర్సనల్ లైఫ్ గురించి నిత్యం ఏదోక వార్త నెట్టింట హల్చల్ చేస్తుంటుంది. ఈ బ్యూటీ శిఖర్ పహరియాతో ప్రేమలో ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.





# సంక్రాంతికి వస్తున్నాం

అగ్ర కథానాయకుడు వెంకటేష్ నటిస్తున్న తాజా చిత్రానికి 'సంక్రాంతికి వస్తున్నాం' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. అనిల్ రావిపూడి దర్శకుడు. ఎఫ్2, ఎఫ్3 చిత్రాల తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో వస్తున్న మూడో చిత్రమిది కావడం విశేషం. దీంతో ఈ సినిమాపై ఇప్పటికే అంచనాలు ఏర్పడ్డాయి. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. శుక్రవారం టైటిల్‌ను ప్రకటించడంతో పాటు ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. హీరో, ఆయన భార్య, మాజీ ప్రేయసి మధ్య నడిచే ట్రయాంగిల్ క్రైమ్ ఎంటర్‌టైనర్ ఇదని, ఆద్యంతం హాస్యప్రధానంగా ఆకట్టుకుంటుందని చిత్రబృందం పేర్కొంది. మీనాక్షి చౌదరి, ఐశ్వర్యరాజేష్ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, రచనదర్శకత్వం: అనిల్ రావిపూడి.




# ఆర్థిక అంతరాల కుబేర

ధనుష్, నాగార్జున, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'కుబేర'. శేఖర్ కమ్ముల దర్శకుడు. ఓ పాట మినహా చిత్రీకరణ పూర్తయింది. ఈ నెల 15న టీజర్‌ను విడుదల చేయబోతున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో నాగార్జున, ధనుష్ భిన్న ధృవాలుగా కనిపిస్తున్నారు. మురికివాడలో పిల్లల నడుమ ఏదో అన్వేషిస్తున్నట్లుగా రష్మిక మందన్న లుక్ ఆసక్తినిరేకెత్తిస్తున్నది. సమాజంలోని ఆర్థిక అంతరాలు, సామాజిక పరిస్థితులను చర్చిస్తూ ఓ వినూత్నమైన కాన్సెప్ట్ తో దర్శకుడు శేఖర్ కమ్ముల ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారని సమాచారం. ఇప్పటికే విడుదల చేసిన ప్రచార చిత్రాలకు అద్భుతమైన స్పందన లభించిందని, టీజర్‌లో సినిమా కాన్సెప్ట్‌ను రివీల్ చేస్తామని మేకర్స్ తెలిపారు. శ్రీవెంకటేశ్వర సినిమాస్, అమిగోస్ క్రియేషన్స్ పతాకంపై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

# రాబిన్‌హుడ్‌లో స్టైలిష్ లుక్‌లో నితిన్

నితిన్, శ్రీలీల జంటగా రూపొందుతోన్న యాక్షన్ కామెడీ ఎంటర్టైనర్ 'రాబిన్‌హుడ్'. వెంకీ కుడుముల దర్శకుడు. మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది. దీపావళి పర్వదినం సందర్భంగా మేకర్స్ ఈ సినిమా స్పెషల్ పోస్టర్‌ని విడుదల చేశారు. నితిన్ స్టైలిష్ గా మాసీవ్‌గా ఈ పోస్టర్‌లో కనిపిస్తున్నారు. త్వరలోనే ఈ సినిమా టీజర్ విడుదల కానుంది. మైత్రీమూవీమేకర్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో రాజేంద్రప్రసాద్, వెన్నెల కిశోర్ తదితరులు ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: సాయిశ్రీరామ్, సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్.




Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com